క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీకి వినతి



జీవన్‌రెడ్డిని కలిసిన కుమ్మరిపల్లి గ్రామస్తులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో తాగునీటి బావి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుమ్మడి భూమయ్య, నాయకులు నాగిరెడ్డి తిరుపతిరెడ్డి, సూర జగన్, గుమ్మడి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: పట్టణంలోని 21వార్డులో సీసీ రోడ్డు పనులకు మంగళవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.30 లక్షలతో రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయిస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందని, ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్ భీమనాతి భవాని తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు చేరిన తర్వాత ట్యాబ్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ బాలే శివాజీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సందర్శించి రోజుకు 170 మందికి కంటి పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సీఎం కప్ క్రీడా పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం మరమ్మతు ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్లను తొలగిస్తున్న అధికారులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో ఎత్తిపోతల పథకాలకు అధికారులు మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. గడచిన వర్షాకాలం గోదావరి ఉప్పొంగడంతో రేకులపల్లి గ్రామ శివారుల్లో గోదావరి వెంట ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం రూ. 1.41 కోట్లతో కొత్తగా మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసింది. అధికారులు ప్రస్తుతం చెడిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రిని తొలగించే పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలగందుల లక్ష్మి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

మేరా లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ పై అవగాహన

కోరుట్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 లో భాగంగా జూన్ 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా లైఫ్-మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ల ఏర్పాటుపై వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అభినయ్ కుమార్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కలగానే వాల్గొండ పర్యాటక కేంద్రం?

- శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి అంతంత మాత్రమే
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- జాడలేని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న వాల్గొండ బ్యారేజీ
- ఇబ్బందుల్లో గ్రామస్తులు



వాల్గొండ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం



వాల్గొండ గ్రామపంచాయతీ కార్యాలయం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ గోదావరి నది తీరంలో కొలువుదీరిన ఉత్తర ముఖ ద్వారం కలిగిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామలింగేశ్వర ఆలయంతో ప్రసిద్ధిగాంచిన గ్రామం. కానీ వాల్గొండను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని దశాబ్దాలకు పైగా విన్నవిస్తున్నా... ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు. ఇదే కాకుండా వాల్గొండ గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. గ్రామంలో అనేక సమస్యలు తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించాలని గత పంచాయతీ పాలకులు, అధికారులకు గ్రామస్తులు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో ప్రధానంగా తాగునీరు సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ, అంతర్గత రోడ్లను సీసీ రోడ్డుగా మార్చడం, వాల్గొండ-గొర్రెపల్లికి బీటీరోడ్డు మరమ్మతు, వ్యవసాయానికి సాగు, ప్రజలకు తాగు నీరందించేందుకు గోదావరి నదిపై బ్యారేజీ కమ్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం వంటి సమస్యల పరిష్కారం కోసం ఏళ్లుగా వినతిపత్రాలు ఇచ్చినా అవి బుట్టదాఖలే అయ్యాయి. సమస్యలపై పాలకులు, అధికారులు స్పందించి పరిష్కంచడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రధాన సమస్యలు....

- వాల్గొండ శివారులోని గోదావరినదిపై ఆనకట్ట నిర్మించి చెరువులు నింపడంతో పాటు సాగుకు నీరందించాలి.
- గోదావరినది ఒడ్డున ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- గ్రామపంచాయతీ పరిధిలో అంతర్గత రహదారుల్లో 50 శాతం సీసీరోడ్లు, 40 శాతం మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది.
- గోదావరి నదిపై బ్యారేజీ, రోడ్డు కమ్ బ్రిడ్జిని నిర్మిస్తే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో రవాణా పరంగా అభివృద్ధి చెందుతుంది.
- అంతర్గత రహదారులపైకి మురుగునీరు చేరి ప్రవహించడంతో పాటు నిల్వ ఉండడంతో చెత్తాచెదరాలు, దుర్గంధంతో ప్రజలు అనారోగ్యానికి గురై సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు.
- అసంపూర్తిగా ఉన్న మిషన్‌భగీరథ పనులు త్వరగా పూర్తిచేసి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించాలి
- వాల్గొండలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. సంబంధిత అధికారులు గుత్తేదారులతో డబుల్ నిర్మాణాలు ప్రారంభింపచేసి అర్హులైన వారికి అందించాలి.

వాల్గొండ గ్రామ వివరాలు	
జనాభా :	1847
పురుషులు :	899
స్త్రీలు :	948
ఓటర్లు :	1083
వార్డులు :	8
కుటుంబాల సంఖ్య :	580

పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి



వాల్గొండ శ్రీ రామలింగేశ్వర ఆలయం ఉత్తర ముఖ ద్వారం కలిగిన ఏకైక త్రికూటాలయంగా ప్రసిద్ధి పొందింది. శ్రీ రామనవమి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి.

– క్యాతం సుజాత, ఎంపీటీసీ, వాల్గొండ

గోదావరినదిపై బ్యారేజీ నిర్మించాలి



వాల్గొండతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు గ్రామశివారులోని గోదావరినదిపై బ్యారేజీని నిర్మించాలి. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువుల్లో జలకళను సంతరించుకోవడంతో పాటు తాగు, సాగునీటి అవసరాలు తీరుతాయి.

– దండిక గంగు, సర్పంచ్,వాల్గొండ

ఆడబిడ్డలకు సర్కారు కానుక ‘కల్యాణలక్ష్మి’

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు సర్కారు కానుక అని, అభివృద్ధి, సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదల ఆడబిడ్డల వివాహానికి భరోసానిచ్చేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, ఏఎంసీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుజాత, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, పాక్స్ రాంలింగారెడ్డి, కోఆప్షన్ ఎండీ.అజారొద్దీన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, మారంపల్లి నారాయణ, జోగినిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే తన కుమారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ కంపెనీల్లో ఐటీ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి కల్పిస్తున్నామని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర రావు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీవీఫై కంపెనీ ప్రతినిధులు డిగ్రీ, ఆపై చదువులు చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఈ ఐటీ కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. సుమారు 300 మంది నిరుద్యోగ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. అర్హులైన వారికి అవకాశం కల్పించనున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్, మున్సిపల చైర్మన్ అన్నం లావణ్య, వైస్ చైర్మన్ పవన్, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, వీవీఫై కంపెనీ ప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న నాయకులు

పెగడపల్లి: టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ పరీక్ష పత్రాలు ప్రతిపక్షాలు లీక్ చేశాయని ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం అన్నారు. మంగళవారం పెగడపల్లిలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటు తరువాత వివిధ ప్రభుత్వ శాఖల్లో 1,92,126 ఉద్యోగాలు ఖాళీలున్నాయని బిశ్వాల్ కమిటీ తేల్చిందని మంత్రి కేటీఆర్ 2.20 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రతిపక్షాల పాత్ర ఉన్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ బృందం వారి పేర్లను ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొమురెల్లి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, నరేందర్, పాల్గొన్నారు.

‘హామీల అమలులో పార్టీలు విఫలం’

కోరుట్ల: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు విఫలమయ్యాయని కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్ అక్బర్ అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. రెండు పార్టీలు ఇచ్చిన హామీలు మరిచి దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆరోపించారు. కమీషన్ల కోసమే ప్రభుత్వాలను నడుపుతున్నారని పేర్కొన్నారు. దేశంలో నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని దుయ్యబట్టారు. కర్నాటక ఫలితాలే రాష్ట్రంలో పునరావృతం అవుతాయన్నారు. కార్యక్రమంలో చాంద్ పాషా, సల్మాన్,తదితరులుపాల్గొన్నారు.

నేడు మెట్‌పల్లి బంద్

మెట్‌పల్లి: జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం మెట్‌పల్లి బంద్ నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు పోహర్ తుక్కారాం తెలిపారు. బంద్‌కు పట్టణంలోని వ్యాపారులందరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

కల్వర్టు పనులు ప్రారంభం

సాక్షి స్పందన

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కల్వర్టు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 3న ‘నిలిచిన కల్వర్టు నిర్మాణ పనులు’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వెంటనే పనులు చేపట్టేలా చూడాలని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాస్‌ను ఆదేశించగా కోర్టుకు వెళ్లి కౌంటర్ ఫైల్ వేయడంతో పనులు ప్రారంభించారు. సకాలంలో పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

విద్యార్థినికి అభినందన

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరే వరకు శ్రమించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాధుల వెంకటస్వామి అన్నారు. మండలంలోని సిరిపూర్‌కి చెందిన నునావత్ మణిమాల ఇంటర్ ఫలితాల్లో సెకండ్ బైపీసీలో స్టేట్ రెండో ర్యాంక్ సాధించడంతో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో సన్మానించారు. విద్యార్థులు మణిమాలని ఆదర్శంగా తీసుకొని చదవాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా గోవింద్ నాయక్, విద్యార్థిని తండ్రి నునావత్ రాజు, పెంట రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

మల్లాపూర్: గ్రామాల్లో ఈ నెల 17 నుంచి 23 వరకు పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్పీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్ర పరచడం, నిల్వ నీరు లేకుండా చూడడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిరంతరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం, డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

బుగ్గారం: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికే సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని ఎంపీపీ, జెడ్పీటీసీ బాదినేని రాజమణి, రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూక్, ఎంపీడీవో తిరుపతి, ఎంఈవో భూమయ్య సర్పంచ్ మూల సుమలత, నాయకులు గాలిపెల్లి మహేశ్ తదితరులున్నారు.

జగిత్యాలరూరల్: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా జగిత్యాల మినీ స్టేడియంలో జగిత్యాల రూరల్ మండలం బాలబాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకుని గెలుపే లక్ష్యంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈవో గాయత్రి, ఎంపీవో రవిబాబు, పీఈటీలు అజయ్‌బాబు, కోటేశ్వర్‌రావు, వెంకటలక్ష్మి, దయాకర్, రాజేచందర్ పాల్గొన్నారు.

మెడికల్ హబ్‌గా జగిత్యాల

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా కేంద్రం మెడికల్ హబ్‌గా మారిందని, అన్ని రకాల వైద్యసేవలు ప్రభుత్వ ఆస్పత్రిలో లభిస్తున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణ, అర్బన్, రూరల్ మండలాల్లోని 76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జగిత్యాలలో రూ.100 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం లభిస్తుందని తెలిపారు. రూ.4 కోట్లతో డయాగ్నోస్టిక్ సెంటర్, రూ.1.80 కోట్లతో సిటీ స్కాన్, రేడియాలజీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జెడ్పీటీసీ మహేశ్, ఆనందరావు, సమిండ్ల శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయి

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఎస్సై కిరణ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి

సారంగాపూర్: యువతకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, ఎంపీపీవో రాజేందర్, ఎస్సై మనోహర్‌రావు, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

వంజరి కుల సంక్షేమానికి కృషి

జగిత్యాల: వంజరి కుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంజరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని కుల సామాజిక వర్గాల్లాగే వంజరికుల సంఘాల అభివృద్ధి పనులకు నిధులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశాల్, కృష్ణమూర్తి, సంఘసేవకులు మంచాల కృష్ణ, ఆరె శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

వెల్గటూర్: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023లో భాగంగా మంగళవారం ఎండపల్లి మండలం పడకల్, రాజారాంపల్లి గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ మంద మకరందు పర్యటించారు. రాజారంపల్లి గ్రామంలోని వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, నర్సరీ పనులు పరిశీలించి, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం తొలగించాలని, హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించి, రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలని ఆదేశాలు జారీచేశారు. అనంతరం పడకల్ గ్రామంలో గ్రామపంచాయతీ, గ్రంథాలయంకు కేటాయించిన గదులను, శిథిలాలు తొలగించాలని, ప్రతి ఇంటికీ ఇంకుడుగుంతలు నిర్మించాలని, కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణాలు చేపట్టాలని, మహిళా సంఘాలను శానిటేషన్ పనుల్లో పాల్గొనే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కె లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో అనిల్, సర్పంచ్ కంది లావణ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



పెగడపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెగడపల్లి: డెంగీ ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక వైద్యాధికారి నరేశ్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ నరేశ్ సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మల్యాల: డెంగీ నివారణపై అవగాహన పెంపొందించుకుని, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యురాలు మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక బ్లాక్ చౌరస్తా వరకు జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునంద, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, డీపీఎంఓ దేవీసింగ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: భాగస్వామ్య పద్ధతులను ఉపయోగించడం వల్ల డెంగీ నిర్మూలించవచ్చునని వైద్యాధికారి శ్రీజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. డెంగీ వస్తే తీసుకోవాలిన్సన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, సీహెచ్‌వో విజయభాస్కర్, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాత పద్ధతిలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

రాయికల్: పట్టణంలోని రామాజీపేట గ్రామానికి వెళ్లే బతుకమ్మ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పాత పద్ధతిలోనే నిర్మించాలని, కాంట్రాక్టర్ తన ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారని, దీంతో పక్కనే భూములు అన్యాక్రాంతమవుతున్నాయని బుధవారం బాధితులు నర్సయ్య, హన్మండ్లు, వంశీ, శ్రావణ్‌కుమార్ తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు.

తాండ్ర్యాలలో ఇంటింటా వైద్య సర్వే

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా వైద్య సర్వే కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు బీపీ పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సర్వే పూర్తయ్యాక గ్రామంలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా మందులు, అవసరమైన వారికి చికిత్స అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాలీసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కోరుట్ల: పట్టణంలో బుదవారం నిర్వహించే పాలీసెట్ 2023 పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని పాలీటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 5 సెంటర్లలో 1376 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పది నుంచే పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామన్నారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ సిద్ధోగం



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మంగళవారం సాయంత్రం రేణుకాఎల్లమ్మ సిద్ధోగం గౌడసంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 11 మంది గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కి చేతుల మీదుగా తాటికల్లు కుండను కిందకి తీసుకువచ్చారు. ఎల్లమ్మ దేవతకు కల్లు సమర్పించి పూజలు చేశారు. ఉత్సవాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపెల్లి చంద్రశేఖర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు హాజరయ్యారు.